క్లుప్తంగా

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

గూడెంకొత్తవీధి: గిరిజనులు మండల కేంద్రంలో బుధవారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో సీఐ అశోక్‌కుమార్ సమావేశం నిర్వహించారు. గిరిజనులు గంజాయి సాగుకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం 90 రాయితీపై విత్తనాలు అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ బోయిన కుమారి, తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ అప్పల సూరి, వైస్ ఎంపీపీ దేముడు, ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోస్టుమెన్ ఉమాశంకర్

డుంబ్రిగుడ సొవ్వ పంచాయతీ కొరంజిగుడ గ్రామంలో బుధవారం పోస్టల్ సేవలపై పోస్టుమెన్ ఉమాశంకర్ అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి తదితర పథకాలను గ్రామస్తులకు వివరించి ఖాతాలు తెరిచారు. సర్పంచ్ సాయిత, నేత అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ కిట్‌లు అందజేస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: సొవ్వలో ఎస్ఐ సంతోష్‌కుమార్ బుధవారం సందర్శించారు. గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు పోలీసు శాఖ తరఫున క్రీడా కిట్లు అందజేస్తున్నామన్నారు. నాయకుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

డుంబ్రిగుడ: ప్రభుత్వ పథకాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండి, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. అరమ పంచాయతీ ముసిరి, గొందిగుడ గ్రామాల్లో హుకుంపేట జెడ్పీటీసీ సభ్యు డు రేగం మత్స్యలింగం బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్య టించి, సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



హెచ్‌ఎం ఆనందరాజు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలోని పనసలపాలెంలో హెచ్‌ఎం , మండల ఇన్‌చార్జి అకాడమిక్ అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న జి.ఆనందరాజుతో పాటు బదిలీపై వెళ్తున్న మరో పది మంది ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన హెచ్‌ఎం అప్పలనాయుడు అధ్యక్షతన ఉపాధ్యాయులు బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ రోలిపల్లి నరశింహమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతుడు సన్మాన గ్రహీతులు అందించిన సేవలను కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను గిరిజనులకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మొల్లేరులో గ్రామస్తులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

అరకులోయ రూరల్: ఇంటింటికీ సంక్షేమం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. అరకులోయ పట్టణంలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 235 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించి, ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా పారదర్శంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. జగనన్న అందిస్తున్న సుపరిపాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తోందన్నారు. విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న వసతి, జగనన్న విద్యా కానుక వంటి పథకాలు అమలుచేస్తూ, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థతో అన్ని పథకాలను ప్రజల చెంతకే అందిస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ ఉషా రాణి, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యులు భీమరాజు, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, నాయకులు ఘనాథ్, సాంబ, బాబూరావు, సత్యానందం, వెంకటరావు, దివ్య, సుంద్ర, శివ, గురు, రాంబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గంగవరం: అర్హుడైన ప్రతీ పేదోడికి ప్రభుత్వ లబ్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు) అన్నారు . గంగవరం మండలం మొల్లేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సుమారు 500 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ మొల్లేరు పంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కింద రూ.11కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. వేలాది మందికి సంక్షేమ పథకాలను వర్తింపజేశామన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు స్థానికంగా పశు వైద్యశాల కోసం విన్నవించారు. ఆయన స్పందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓ గ్రామస్తురాలు తన దివ్యాంగ కుమారుడికి పింఛన్ కోసం విన్నవించగా, ఆయన తక్షణమే స్పందించి, సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ బేబిరత్నం, వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, సర్పంచ్ కుంజం లక్ష్మి, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, మొల్లేరు సొసైటీ చైర్‌పర్సన్ తిరుపతిరావు, డైరెక్టర్లు ప్రసాద్, సిద్ధార్థ, అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు ఏడుకొండలు, దిండి బాబి, మాజీ ఎంపీటీసీ బలిజ రాజారావు, సచివాలయాల కన్వీనర్ శ్రీను, మండల పార్టీ కన్వీనర్ అప్పలరాజు, మండల ఇన్‌ఛార్జ్ రఘు, నాయకులు కొండారావు, జంబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఇక్కడ కొనసాగిన ఆధార్ కేంద్రం పనితీరుపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో కేంద్రాన్ని సీజ్ చేశారన్నారు. ప్రస్తుతం ఆధార్ కేంద్రం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్థానిక గిరిజన యువతకు కేంద్రం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. వైస్ ఎంపీపీ వెంగళయ్య, మండల పార్టీ కన్వీనర్ పాంగి గణబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ



పింపుడువలసలో విద్యార్థులకు స్టేషనరీ, పౌష్టికాహారం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అనంతగిరి: మండలంలోని తుమ్మనవలస, పింపుడువలస, బలియగుడ, జాకరివలస, ముర్వంవలస, డముకు, బంగారంపేట, సింగర్బ, కపటివలస గ్రామాల్లో 530 మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు, సమిధ సంస్థ ఆధ్వర్యంలో స్టేషనరీ, పౌష్టికాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోని సంస్థ కార్యదర్శి వీరభద్రరావు మాట్లాడుతూ బైబిల్ టబర్నకల్ చర్చి (అమెరికా) ఆర్థిక సాయంతో గిరిజన నిరుపేద విద్యార్థులకు స్టేషనరీ, పౌష్టికాహారం తదితర సామగ్రిని అందజేస్తున్నామన్నారు. బుద్ధరాజు, దేముడమ్మ, సింహాద్రి, బలరాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

72 మందికి వైద్య పరీక్షలు



ఏడుచావళ్లులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ శశికాంత్

జి.మాడుగుల: మండల కేంద్రంలోని పాలమామిడి సచివాలయం పరిధిలోని ఏడుచావళ్ల గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 72 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నిల్వ ఆహారం తీసుకొద్దని, కాచిన నీటిని తీసుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈవో ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన సమస్యలపై గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేసిన పలు విషయాలను చర్చించారు. పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పనులు సక్రమంగా లేవని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 పంచాయతీ పరిధిలో పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నీటి పథకాలు పూర్తి కాలేదని, పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు చెప్పారు. పట్టణంలో పలుచోట్ల పైపులైన్లు దెబ్బతినడంతో కొన్ని చోట్ల తాగునీటి సమస్య ఉందని, అధికారులు స్పందించి త్వరితగతిన సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామన్న, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



జీకే వీధిలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ కుమారి



చెరకుంపాలెంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరావు

హుకుంపేట/గూడెం కొత్తవీధి/కొయ్యూరు/రాజవొమ్మంగి: జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేపడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, ఇతరత్రా పథకాల కోసం వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జగనన్న సురక్షతో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయన్నారు. హుకుంపేట ముండలంలోని సంతారి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణ, ఎంఎల్‌వో శివరామ్, సర్పంచ్‌లు అప్పలనాయుడు, లక్ష్మయ్య, పోతురాతు నాయకులు కామరాజు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. జీకే వీధిలో ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్, వైస్ ఎంపీపీ దేముడు, ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.
కొయ్యూరులో వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, దొర, అచ్చిరాజు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో సర్పంచ్ కాంతం, పంచాయతీ ఇన్‌చార్జ్ అర్జున్, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టబాయ్

పాడేరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర, కంప్యూటర్ విభాగ సంయుక్తంగా పీసీ మహా లాబినెస్ జయంతి సందర్భంగా జాతీయ గణాంక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టబ్బాయ్ మాట్లాడుతూ గణాంక విభాగం కోసం గణిత, అర్థశాస్త్ర విద్యార్థులు ప్రావీణ్యత పొంది ఉండాలన్నారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా అర్థగణాంక అధికారి ఎస్.ఎస్.ఆర్. కె.పట్నాయక్, గణిత శాస్త్ర విభాగాధిపతి వీసీల, వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

రాజవొమ్మంగి: ప్రభుత్వ పథకాలు పొందేందుకు లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకైవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు చెప్పారు. మండలంలో 3557 మందికి అమ్మఒడి నగదు జమ అయిందన్నారు. అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయన్నారు.

పాఠశాలను తరలించాలి

కొయ్యూరు: కొయ్యూరు ఏకలవ్య పాఠశాలను చింతపల్లి వైటీసీకి తరలించాలని ఆదివాసీ జేఏసీ వైస్ చైర్మన్ రాజుబాబు కోరారు. రాజవోమ్మంగి సమీపంలో తాళ్లపాలెం తరలించడం సరికాదన్నారు. బాలారంలో పాఠశాలకు కేటాయించిన స్థలంలో పాఠశాల భవనాలు నిర్మించాలని కోరారు.

అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ గోపాల్

వీఆర్ పురం: లక్ష్మీనగరంలో మండల పార్టీ కన్వీనర్ పాడియం గోపాల్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులపై పార్టీ శ్రేణులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎవరికైనా పథకాలు అందకపోతే వారి వివరాలు సేకరించి, పథకాలు అందేలా చూడాలన్నారు. కూనవరం మండలంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆధ్వర్యంలో త్వరలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. సర్పంచ్ రామారావు, నాయకులు శ్రీని వాస్, గంగలు, మురళీ, సత్యనారాయణ, బాలు, సత్తిబాబు, జయరాజ్ పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు



జగనన్న ఆణిముత్యాలు అవార్డులు అందుకున్న విద్యార్థులు

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎంఈవో కె.తాతబ్బాయిదొర అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డొంకరాయి, వై.రామవరం జిల్లా పరిషత్, తోటకూరపాలెం కేజీబీవీ, పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల, యార్లగడ్డ, వై.రామవరం, పనసలపాలెం,దాలిపాడు, గుర్తేడు, దారగడ్డ, మంగంపాడు ఆశ్రమ పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు అవార్డులో భాగంగా నగదు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. హెచ్‌ఎం మద్దికొండ ఝాన్సీరాణి, నాయకులు కరణం కనకరాజు, మద్దికొండ భారతిబాబు, సీఆర్‌పీలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



కొయ్యూరులో మాట్లాడుతున్న చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, పక్కన జెడ్పీటీసీ నూకరాజు



చినార్కూరులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ విజయ తదితరులు

కొయ్యూరు: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ చెప్పారు. రత్నంపేటలోని బుధవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, సర్పంచ్‌లు పాటి నూకరత్నం, రీముల శ్రీను, నేతలు శేఖర్, తిరుపతి, రామరాజు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని చినార్కూరులో బుధవారం జరిగిన కార్యక్రమంలో 90 శాతం వరి విత్తనాలను రైతులకు ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, సర్పంచులు సున్నం అభిరామ్, కట్టం లక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, గుజ్జాబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నియామకానికి చర్యలు



గ్రామస్తులకు హామీపత్రం అందజేస్తున్న ఎంఈవో రామన్న

గూడెంకొత్తవీధి: మండల కేంద్రానికి సమీపంలోని గుమ్మళ్లగొంది ఉపాధ్యాయుడి నియమాకానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో రామన్న తెలిపారు. ఈ మేరకు బుధవారం గ్రామస్తులకు హామీపత్రం అందజేశారు. గ్రామంలో పాఠశాల లేక స్థానిక విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అద్దరవీధిలోని పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విషయాన్ని స్థానికులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు స్పందనలో తెలియజేయగా, స్పందించి ఉపాధ్యాయుడిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా

పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఎంఈవో రామన్న గ్రామానికి వెళ్లారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాన్ని పూర్తిచేసి పాఠశాల ఏర్పాటు చేసి ఉపాధ్యాయుడిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అద్దరవీధి పాఠశాలకు వెళ్లి గుమ్మళ్లగొంది విద్యార్థుల వివరాలు సేకరించారు. హెచ్‌ఎం కామేశ్వరరావు, సీఆర్‌పీలు దేవేంద్ర, దారబాబు పాల్గొన్నారు.

సీపీఎం విరాళాల సేకరణ

కొయ్యూరు: పోలవరం నిర్వాసితులకు సంఘీభావంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా బుధవారం కొయ్యూరులో సీపీఎం నాయకులు వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు. నాయకులు సూరిబాబు, అప్పలనాయుడు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.